
# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
18-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 58

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## తెలంగాణలో టిడిపి!

**పూర్వవైభవం దిశగా తెలుగుదేశం పార్టీ**

**పార్టీలో చేరేందుకు సీనియర్ నేతలు సిద్ధం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేయనుందా? ఈ మేరకు గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ అవుతోందా? ప్రధాని మోదీ పర్యటనతో ఫుల్ క్లారిటీ వచ్చిందా? వచ్చే ఎన్నికల్లో సైతం ఏపీ పొత్తు ఫార్ములా తెలంగాణలో అనుసరించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

మిగతా 2లో



## ఎట్టకేలకు నోరు తెరిచిన రజనీకాంత్!

**ఎన్నికల ఫలితాల తర్వాత ద్రవిడ పార్టీలను కలిపే ప్రయత్నం**

**సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం**

**ప్రెస్ మీట్ పెట్టి ఫుల్ క్లారిటీ ఇచ్చిన సూపర్ స్టార్**

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** ఎట్టకేలకు తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నోరు తెరిచారు. గత కొద్దిరోజులుగా పొలిటికల్ సర్కిల్స్లో తనపై జరుగుతున్న ప్రచారంపై ఫుల్ క్లారిటీ ఇచ్చారు. తమిళనాడు ఎన్నికల

# బాలికలదే పైచేయి







**ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన కె.కేశవరావు**

**ఇంజనీరింగ్ టాపర్ రుషి.. టాప్--10లో ఇద్దరు ఏపీ విద్యార్థులు**

**గతేడాది కన్నా పెరిగిన అర్హత... వారంలోనే ఫలితాల వెల్లడి**

**ఇంజనీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27 శాతం మందికి అర్హత**

రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్)కు హాజరైన విద్యార్థుల్లో అత్యధిక మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఎం.రుషి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. మూసాపేటకు చెందిన అన్షుల్ రెండో స్థానంలో, ఆంధ్రప్రదేశ్ పులివెందులకు చెందిన ఎం.వంశీధర్ రెడ్డి మూడో స్థానం దక్కించుకున్నారు.

హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లోనూ బాలికలదే పైచేయిగా ఉంది. ఈఏపీసెట్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా మే 4 నుంచి 11 వరకూ సీబీటీ విధానంలో జరిగాయి. ఆదివారం ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డి నేతృత్వంలో జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలో పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,10,766 మంది రిజిస్టర్ చేసుకోగా, 1,97,242 మంది పరీక్ష రాశారు. 1,44,704 మంది అర్హత సాధించారు. అగ్రి, ఫార్మా సెట్‌కు 90,977 మంది దరఖాస్తు చేస్తే, 84,954 మంది పరీక్ష రాశారు. వీరిలో 73,294 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్‌లో బాలురు 84.70 శాతం మంది అర్హత సాధిస్తే, బాలికలు 86.76 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన,

మిగతా 2లో



## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

**తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక**

**మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు**

**45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం**

**ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన**

మిగతా 2లో

## బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్

**పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు అరెస్ట్**

**ఈ నేపథ్యంలోనే కేటీఆర్ విమర్శలు**

**నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ**

**బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్**



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్– నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా

మిగతా 2లో

## యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది..

# స్థానికుల దాడిలో హతం!



**ప్రేమను నిరాకరించిందని జడ్చర్లలో యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు**

**నిందితుడిని పట్టుకుని తీవ్రంగా కొట్టిన స్థానికులు, బంధువులు**

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిందితుడూ మృతి**

**యువతికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడమే కారణమని ఆరోపణలు**

## టిడిపిలోకి కోలగట్ల!

**కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం**

**త్వరలో చేరికకు రంగం సిద్ధం**



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** కోలగట్ల వీరభద్ర స్వామి టిడిపిలో చేరుతారా? కూతురి భవిష్యత్తు కోసం ఈ కీలక నిర్ణయం తీసుకోనున్నారా? ఇప్పటికే ఆయన ఒక డిసిషన్ కు వచ్చారా? టిడిపి హై కమాండ్ నుంచి ఆయనకు గ్రీన్ సిగ్నల్ లభించిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.

మిగతా 2లో



ఏపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావాలని మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ నుంచి జూన్ 21న నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యంగా మారింది. ఏ క్షణంలోనైనా ఆ నాలుగు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది.

## రాజ్యసభ సభ్యుడిగా కిరణ్ కుమార్ రెడ్డి!

**బిజెపి తరఫున ఎంపిక**

**గట్టి ప్రయత్నాల్లో మాజీ ముఖ్యమంత్రి**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో బిజెపి తరఫున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. బలమైన స్థానం కావడంతో ఓడిపోతానని తెలిసి కూడా ఆయన బరిలో నిలిచారు. గట్టి పోటీ ఇచ్చారు. అందుకే రాజ్యసభకు తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు కిరణ్ కుమార్ రెడ్డి.

**సుదీర్ఘ నేపథ్యం..**

కిరణ్ కుమార్ రెడ్డి ది సుదీర్ఘ రాజకీయ నేపథ్య కుటుంబం. చిత్తూరు జిల్లా నుంచి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహిస్తూ వస్తోంది నల్లారి కుటుంబం. కిరణ్ కుమార్ రెడ్డి తండ్రి అమర్నాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా,

మిగతా 2లో




## విడుదల రజిని పాస్ పోర్ట్ సరెండర్!

**హైకోర్టు ఆదేశాలతో నరసరావుపేట డిఎస్పీ కార్యాలయంలో అందజేత**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి విడుదల రజిని తన పాస్పోర్ట్ ను పోలీసులకు అప్పగించాల్సి వచ్చింది. హైకోర్టు జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులు మేరకు ఆమె ఆదివారం పల్నాడు జిల్లా నరసారావు పేట డీఎస్పీ హనుమంతరావును కలిసి..



# రాజ్యసభ సభ్యుడిగా కిరణ్ కుమార్ రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిగా కూడా సేవలందించారు. ఆయన అకాల మరణంతో కుమారుడు కిరణ్ కుమార్ రెడ్డి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. చాలాసార్లు ఎమ్మెల్యే అయ్యారు. 2004లో గెలిచేసరికి మంత్రి పదవి ఆశించారు. కానీ రాజశేఖర్ రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డికి చీఫ్ విప్ పదవి ఇచ్చారు. 2009లో గెలిచేసరికి శాసనసభ స్పీకర్ గా అవకాశము లభించింది. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు రోశయ్య. పొలిటికల్ గా కొంచెం ఇబ్బంది పడ్డారు. దీంతో రోశయ్య స్థానంలో కిరణ్ కుమార్ రెడ్డికి అవకాశం ఇచ్చింది హై కమాండ్. మంచి పాలన అందించాలన్న పేరు దక్కించుకున్నారు. అయితే రాష్ట్ర విభజన ఒకవైపు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం మరోవైపు.. ఏపీలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసింది. అందుకే 2014లో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు కిరణ్ కుమార్ రెడ్డి. ఆ ఎన్నికల్లో ఓటమితో కొద్దిరోజులపాటు సైలెంట్ అయ్యారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు కానీ ఎక్కువ రోజులు ఉండలేకపోయారు. భారతీయ జనతా పార్టీలో చేరి మొన్నటి ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి పొత్తులో భాగంగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

ఎంపీగా పోటీ చేసినప్పుడే హామీ..

వాస్తవానికి రాజంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. అక్కడ గతంలో రెండు సార్లు ఎంపీగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. మూడోసారి ఆయన వైసీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. అక్కడ ఓటమి తప్పదు అని తెలిసిన కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి అభ్యర్థిగా రంగంలోకి దిగారు. స్వల్ప ఓట్ల తేడాతోనే ఓటమి చవిచూశారు. అయితే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలోనే తనకు రాజ్యసభ పదవి ఇవ్వాలన్న షరతు పెట్టినట్లు ప్రచారం నడిచింది. ప్రస్తుతం కిరణ్ కుమార్ రెడ్డి ఆ ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఆయన ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# విడుదల రజిని పాస్ పోర్ట్ సరెండర్!

(మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా పాస్పోర్ట్ ను సరెండర్ చేశారు. ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్.

**హింసించిన కేసులో..**

గతంలో చిలకలూరిపేట పట్టణానికి చెందిన టిడిపి నేత పిల్లి కోటిని పోలీసులు టార్గెట్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో హింసించారు. పోలీసులు కోటిని కొట్టడాన్ని రజిని స్వయంగా వీడియో కాల్ లో చూశారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్లో రజనీతో పాటు ఆమె అనుచరులపై కేసు నమోదు అయింది. పోలీసులు ఆమెపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడంతో అరెస్టు చేయకుండా కోర్టుకు వెళ్లారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసు విచారణ వేగవంతం కావడంతో.. తప్పకుండా అరెస్టు జరుగుతుందన్న ప్రచారం నడిచింది. అరెస్టు భయంతో ఆమె చట్టపరమైన రక్షణ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ లేదా కఠిన చర్యల నుంచి మినహాయింపు కోరుతూ.. రజనీ దాఖలు చేసిన పిటిషన్ పై ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. షరతులతో కూడిన ఆదేశాలను జారీ చేసింది. నిందితురాలు కేసు దర్యాప్తు సంస్థలకు అందుబాటులో ఉండాలని.. విచారణ నుంచి తప్పించుకోవడానికి విదేశాలకు పారిపోయే అవకాశం లేకుండా... తక్షణమే తన పాస్పోర్ట్ ను స్థానిక పోలీస్ అధికారుల వద్ద డిపాజిట్ చేయాలని న్యాయస్థానం నిబంధన విధించింది.

**న్యాయవాదులతో కలిసి వెళ్లి..**

కోర్టు ఆదేశాలతో ఈరోజు విడదల రజిని తన పాస్పోర్ట్ ను ఆదివారం నరసరావుపేట డిఎస్పి కార్యాలయంలో అందజేశారు. ఇద్దరు న్యాయవాదులతో కలిసి పోలీస్ స్టేషన్కు చేరుకున్న ఆమె రిజిస్టర్లో సంతకం చేసి.. తన పాస్పోర్ట్ ను అప్పగించారు. చట్టపరమైన నిబంధనలకు లోబడి.. కేసు దర్యాప్తునకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు రజిని. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి గెలిచారు రజిని. మంత్రిగా కూడా పదవి బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో చాలా రకాల దూకుడు రాజకీయాలు చేశారని ఆమెపై ఒక విమర్శ ఉంది. అందుకు ఇప్పుడు ఆమె మూల్యం చెల్లించుకుంటున్నారు. వరుసగా కేసుల్లో చిక్కుకుంటున్నారు.

# టిడిపిలోకి కోలగట్ల!

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు కోలగట్ల. అప్పటినుంచి పార్టీలో సైతం పెద్దగా యాక్టివ్ గా లేరు. ఇప్పుడు ఆయన మనస్సు మార్చుకున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

**నిబద్ధత నేతగా గుర్తింపు..**

రాజకీయాల్లో నిబద్ధత ఉన్న నేతగా కోలగట్లకు మంచి పేరు ఉంది. 1983లో ఆయన కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. 1989లో తొలిసారిగా కాంగ్రెస్ అభ్యర్థిగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసి ఓడిపోయారు. 1994, 1999లో సైతం ఓటమి తప్పలేదు. 2004లో మాత్రం ఇండిపెండెంట్గా పోటీ చేసి పూసపాటి అశోక్ గజపతిరాజును ఓడించారు. జెయింట్ కిల్లర్ గా నిలిచారు. 2009లో మాత్రం ఆయనకు మరోసారి ఓటమి పలకరించింది. 2013లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి మీసాల గీత చేతిలో ఓడిపోయారు. 2019లో అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతి రాజును ఓడించి ఎమ్మెల్యేగా మరోసారి గెలిచారు. ఏపీ డిప్యూటీ స్పీకర్గా వ్యవహరించారు. 2024 ఎన్నికల్లో అదే అతిథి గజపతిరాజు చేతిలో ఓడిపోయారు కోలగట్ల.

**కుమార్తెకు మేయర్ గా అవకాశం ఇస్తే..**

మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన నాటి నుంచి కోలగట్ల కాస్త సైలెంట్ గానే ఉన్నారు. ఆయన తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం టిడిపిలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆది నుంచి బొత్స శిబిరంతో ఆయనకు అంతగా పడదు. మున్సిపల్ ఎన్నికల్లో తన కుమార్తెను మేయర్ అభ్యర్థిగా అవకాశం ఇస్తే టిడిపిలో చేరేందు కు తాను సిద్ధం అని కోలగట్ల టిడిపి హై కమాండ్ ను కోరినట్లు తెలుస్తోంది. అటు నుంచి సానుకూలత రావడంతో.. కోలగట్ల టిడిపిలో చేరేందుకు దాదాపు ఒక నిర్ణయా నికి వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# తెలంగాణలో టిడిపి!

**ఆ రెండు పార్టీలతో పొత్తు..:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం దిశగా ప్రణాళిక రచిస్తోంది. వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలిసి టిడిపి, జనసేన వెళ్తాయని తెలుస్తోంది. మొన్న ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లారు. వారితో చర్చలు జరిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోడీ షెడ్యూల్లో మార్పు చేస్తూ.. ఇలా నేతల పరామర్శకు వెళ్లడం అంత సులువు కాదు. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పొత్తు సంకేతం అని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ప్రారంభం అయింది. ఆ మరుక్షణం తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్ పెంచుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

**ఆ నేతలంతా యూటర్న్..:** ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి అలియాస్ బిఆర్ఎస్ లో తెలుగుదేశం పార్టీ నేతలు ఎక్కువమంది ఉన్నారు. ఆ పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో నిరాశతో ఉన్నారు. ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశం పార్టీని క్రియాశీలకం చేస్తే చాలామంది నేతలు ఆ పార్టీలో చేరే అవకాశం ఉంది. ఇప్పటికే మాజీ మంత్రి బాబూమోహన్ టిడిపిలో చేరేందుకు సిద్ధం గా ఉన్నారు. మరోవైపు హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి సైతం సంసిద్ధంగా ఉన్నారు. నామా నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, రావుల చంద్రశేఖర్ రెడ్డి లాంటి నేతలు తిరిగి టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వాస్తవానికి ఖమ్మంతోపాటు నల్గొండ,, గ్రేటర్ హైదరాబాద్ లో తెలుగుదేశం పార్టీకి ఇప్పటికీ బలం తగ్గలేదు. సెటిలర్స్ ఉన్నచోట్ల టిడిపి గట్టిగానే ప్రభావం చూపుతోంది. ఇప్పుడు నేతలంతా పార్టీలోకి వస్తే టిడిపికి పూర్వవైభవం ఖాయమని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది.. స్థానికుల దాడిలో హతం!

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది ప్రజల దాడిలో హతమయ్యాడు. ప్రేమను నిరాకరించిందన్న కక్షతో ఓ యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు, ఆ తర్వాత స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ నేడు మృతి చెందాడు.వివరాల్లోకి వెళితే... జడ్చర్లలోని నిమ్మబావిగడ్డకు చెందిన వైష్ణవి (24) పోలేపల్లి సెజ్‌లోని ఓ పాఠశాలలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వెళుతుండగా, అదే ప్రాంతానికి చెందిన తేజ ఆమెను అడ్డగించాడు. తనను ప్రేమించాలని కొంతకాలంగా వేధిస్తున్న తేజ, వెంట తెచ్చుకున్న కత్తితో వైష్ణవిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గొంతు, కడుపు భాగాల్లో పొడవడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది.ఈ దారుణాన్ని కళ్లారా చూసిన వైష్ణవి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. తేజను పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్ర గాయాలతో ఉన్న తేజను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు.గత రెండేళ్లుగా తేజ తమ కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని, ఆమె నిరాకరించడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వైష్ణవికి వేరొకరితో నిశ్చితార్థం జరగడం కూడా తేజ కక్ష పెంచుకోవడానికి కారణమైందని చెబుతున్నారు. మరోవైపు, చనిపోయే ముందు తేజ... “వైష్ణవి నన్ను వాడుకుని డబ్బులు తీసుకుని మోసం చేసింది, అందుకే హత్య చేశాను” అని చెప్పినట్లుగా సమాచారం. ఈ ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకోవడంతో జడ్చర్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాలికలదే పైచేయి

జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొ. టీకే రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.వెంకటేశ్వరరావు, మండలి వైస్ చైర్మన్లు ప్రొ. ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమ్మూద్ పాల్గొన్నారు.

**వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్**

ఎప్‌సెట్ ఫలితాలు వెల్లడవ్వడంతో కాలేజీల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఈ నెలాఖరు నుంచి మొదలు పెడుతున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. మిగతా సీట్లను యాజమాన్య కోటాలో భర్తీ చేస్తారు. ఏపీ విద్యార్థులు టాపర్లుగా నిలిచినప్పటికీ కౌన్సెలింగ్‌లో వారికి అవకాశం లేదని అధికార వర్గాలు తెలిపాయి.

**కన్వీనర్ అసలు హీరో**

కేవలం వారం రోజుల్లోనే ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేయడం మామూలు విషయం కాదని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. అదీ ఎలాంటి చిన్న పొరపాట్లు లేకుండా, ఎలాంటి సమస్యలు రాకుండా ప్రశాంతంగా ఫలితాలు వెల్లడించడం అభినందనీయమన్నారు. పరీక్షల్లో ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులే కాదు... సెట్ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి కూడా హీరోనే అని కొనియాడారు.

# బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న ‘బేటీ పడావో.. బేటీ బచావో’ నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.



# ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

(మొదటి పేజీ తరువాయి)

వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

# ఎట్టకేలకు నోరు తెరిచిన రజనీకాంత్!

(మొదటి పేజీ తరువాయి)

ఫలితాల తర్వాత అస్పష్టమైన వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. అతి పెద్ద పార్టీగా విజయ్ టీవీకే నిలిచింది. 107 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. డీఎంకే 75 సీట్లతో బలమైన ప్రతిపక్షంగా నిలిచింది. అన్నా డీఎంకే సైతం చెప్పుకోదగ్గ స్థానాల్లో విజయం సాధించింది. అయితే విజయ్ అధికారంలోకి రాకుండా.. రెండు ద్రవిడ పార్టీలను సూపర్ స్టార్ రజినీకాంత్ కలిపేందుకు ప్రయత్నం చేశారని.. రెండు పార్టీల ఉమ్మడి ప్రభుత్వం వస్తుందని.. అవసరం అనుకుంటే రజినీకాంత్ సీఎం గా చేసేందుకు ఆ రెండు పార్టీలు ఓకే చెప్పాయని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడిచింది. అయితే అదంతా గాసిప్ గా భావించారు. కానీ రోజురోజుకు ఆ ప్రచారం తీవ్రం కావడంతో రజనీకాంత్ స్వయంగా స్పందించారు.

**ప్రెస్ మీట్ లో వెల్లడి..**

ఈరోజు తన నివాసంలో ప్రెస్ మీట్ పెట్టారు రజనీకాంత్. తమిళ రాజకీయాల్లో తన పేరు సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి వాడుకుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం అత్యధిక స్థానాలు సాధించిన విజయ్ కు ఫోన్ చేసి అభినందనలు తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. విజయ్ సాధించినది ఒక అసాధారణ విజయం గా అభివర్ణించారు. విజేతకు అభినందనలు తెలుపుతూ... ఎన్నికల్లో ఓటమి చవిచూసిన స్టాలిన్ కు సానుభూతి చూపానే తప్ప మరో అభిప్రాయానికి తావు లేదన్నారు. ప్రజాభిప్రాయా నికి ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని చెప్పారు. స్టాలిన్ తనకు మంచి స్నేహితుడు అని.. ఆయన ఎమ్మెల్యేగా ఓటమి చవిచూడడం చాలా బాధ వేసిందని.. అందుకే పరామర్శించానని చెప్పుకొచ్చారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం తప్ప.. మార్చే శక్తి ఎవరికీ లేదని తేల్చి చెప్పారు. రజినీకాంత్ ఫుల్ క్లారిటీ ఇవ్వడంతో గత కొద్దిరోజులుగా ఆయనపై జరుగుతున్న ప్రచారానికి చెక్ పడినట్లు అయ్యింది.

**వచ్చినట్టే వచ్చి వెనక్కి..**

తమిళ రాజకీయాల్లోకి రజనీకాంత్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తన వయస్సు కారణంగా.. రాజకీయాల్లోకి వస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న భావనతో వెనక్కి తగ్గారు రజినీకాంత్. పలుమార్లు అభిమానులతో సమావేశాలు కూడా నిర్వహించారు. ఇక పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నానని స్పష్టమైన ప్రకటన చేశారు. కానీ ఎందుకో మళ్లీ యూటర్న్ తీసుకున్నారు. రాజకీయాల్లోకి రావడం లేదని తేల్చి చెప్పారు. తర్వాత విజయ్ టీవీకె పార్టీని ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికలకు ముందు విజయ్ పార్టీ నేత ఒక్కరూ రజనీకాంత్ రాజకీయ యూటర్న్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై రజనీకాంత్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే విజయ్ పార్టీకి వ్యతిరేకం అయ్యారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక అస్పష్టమైన మెజారిటీతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ సమయంలో డిఎంకెతో పాటు అన్నా డీఎంకే ను కలిపే ప్రయత్నం రజనీకాంత్ చేశారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలతో ఇది నిజమేనని ఎక్కువమంది భావించారు. రోజురోజుకు ఈ ప్రచారం ఎక్కువ కావడంతో రజనీకాంత్ స్వయంగా రంగంలోకి దిగారు. ఈ అంశంపై స్పష్టత ఇచ్చారు. ఇకనైనా ఈ ప్రచారానికి తెర పడుతుందా? లేదా? అన్నది చూడాలి.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 18-5-2026


# ప్రాణాపాయంగా ఉంది..!!

## బెనిఫిట్స్ డబ్బులు ఇవ్వండి ఆదుకోండి.!!

## విలేకరుల సమావేశంలో రిటైర్డ్ హెచ్ఎం చెరుకుపల్లి వెంకయ్య ఆవేదన




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ సంవత్సరం క్రితం పదవి విరమణ పొందిన తనకు ప్రాణాపాయ ఏమైనా క్యాన్సర్ తో పాటు ఇతర అనేక వ్యాధులు వ్యాపించాయని చేతిలో చిల్లి గవ్వ లేక ప్రభుత్వం నుంచి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బులు రాక చికిత్స చేయించుకునే పరిస్థితి లేకుండా పోయిందని రిటైర్డ్ హెచ్ఎం చెరుకుపల్లి వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట జడ్పీ జిహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ సంవత్సర కాలం క్రితం రిటైర్మెంట్ అయ్యానని రిటైర్మెంట్ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన అనేక రకాల బెనిఫిట్స్ డబ్బులు దాదాపు 60 లక్షలు రావాల్సి ఉందని నేటికీ కూడా డబ్బులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగోలేదని, గుండెకు రక్తప్రసరణ సక్రమంగా లేక రెండు స్టంట్ లు వేశారని ఇవి కాక ప్యాంక్రియా క్యాన్సర్ తోపాటు అనేక వ్యాధులు వ్యాపించినట్లు డాక్టర్లు నిర్ధారించడం జరిగిందని తెలిపారు. తన వద్ద ఉన్న డబ్బుతో చికిత్స కు ఖర్చు చేయడం జరిగిందని ప్రస్తుతం క్యాన్సర్ కు, ఇతర వ్యాధులకు చికిత్స చేయాలంటే వైద్యులు దాదాపు 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపినట్లు వెల్లడించారు. హైదరాబాద్ లోని అనేక ఆసుపత్రులలోను ఖమ్మంలోని పలు ఆసుపత్రులలో చికిత్స కోసం వైద్యులను సంప్రదించటం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నానని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, డీఈవో ఇతర ఉన్నతాధికారులు స్పందించి తనకు రావాల్సిన బెనిఫిట్స్ డబ్బులను సకాలంలో ఇప్పించి చికిత్సకు కావాల్సిన డబ్బులను అందించి తనకు ప్రాణ బిక్ష పెట్టాలని వేడుకున్నారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎం ఆర్ ఇ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి గురు ప్రసాద్, జిల్లా అధ్యక్షులు మాడుపల్లి బాబు, అల్లంకి జయపాల్, ఎం ఈ ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు తెల్లపూట జమాలయ, ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేళ్లచెరువు బాబు, ప్రధాన కార్యదర్శి కోటపింజర రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెరుకుపల్లి మురళి, కోశాధికారి దూరి జయరాజు, ప్రచార కార్యదర్శి తెల్లూరి యాదగిరి, టి జి పి ఓ ఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మన్నె గురుమూర్తి, ఎం ఈ ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో మేటి ప్రసాద్స్ ఫౌండేషన్: ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ..



**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** మియాపూర్ కేంద్రంగా గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక కార్యక్రమాలు చేపట్టిన ప్రసాద్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనియాడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం నాడు ఎస్ ఆర్ ఎస్టేట్స్ కమిటీ హాల్ లొ 16వ ఉచిత మెగా హెల్త్ క్యాంపు కార్యక్రమం ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు . ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ,డైరెక్టర్ రమాదేవి ,డైరెక్టర్ అండ్ చీఫ్ కోఆర్డినేటర్ లీలాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపులో ఏమ్ ఎల్ ఏ అరెకపూడి గాంధీ ప్రారంభించారు ఈ మేగా హెల్త్ క్యాంపులో అన్ని రకాల ఆరోగ్య పరిక్షలు ఈసీజీ,, 2 డి ఎకో, క్యాన్సర్ స్క్రీనింగ్, బిపి అడ్మిట్ , రక్త పరీక్షలు,అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు . ప్రసాద్స్ ఫౌండేషన్, మెడి కవర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఉచితంగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ సమాజ సేవ చేసేవారు ఇంట్లో కూర్చుని మాట్లాడటం కాదు ప్రజల లోకి వచ్చి సమాజ సేవ చేస్తున్న ప్రసాద్ ఫౌండేషన్ ఒకచక్కటి ఉదాహరణ అని వారి సేవలను కొనియాడారు .ఈ సందర్భంగా ప్రసాద్ ఫౌండేషన్ వారు చేస్తున్నటువంటి సామాజిక కార్యక్రమాలు విద్యార్థులకు బుక్స్, అనాథాశ్రమాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ పంపిణీ , కరోనా సమయం లొ నిత్యావసర వస్తువులు, స్వైన్ ఫ్లూ మందులు, కరోనా వ్యాక్సిన్స్, మరియు స్కూల్లో ఉచిత ఎగ్జామ్ కిట్లు, మహిళా సాధికారత కోసం కుట్టు మిషన్ లు, వెట్ గ్రైండర్స్, తోపుడు బళ్లు, గొడుగులు, తోపుడు బళ్లకు సోలార్ లైట్స్, వంటి అనేక కార్యక్రమాలతో విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు .మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హైదర్నగర్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ ,ప్రసాద్ ఫౌండేషన్ డైరెక్టర్ లీలా ప్రసాద్ , సమ్మెట ప్రసాద్, స్వామి, డాక్టర్ రవి, ఫౌండేషన్ సభ్యులు వినోద్ చౌదరి, ఎంఆర్కె చౌదరి , శ్రీ కాంత్, శ్రీను చౌదరి, బాలు, చిన్నా,పెద్దబాబు , భాష , రవి, తులసి, యశ్వంత్,సుబ్బారావు, శ్రీనివాస్, ప్రసాద్, ఎస్ ఆర్ ఎస్టేట్స్ అసోసియేషన్ సభ్యులు, వెంకటేశ్వర్లు, బాబ్జీ, మూర్తి, శ్రీ రామ చంద్ర మూర్తి, సత్యనారాయణ, సాంబయ్య, నాని తదితర సభ్యులు పాల్గొన్నారు, పెద్ద సంఖ్య లొ మహిళలు , మరియు పురుషులు పాల్గొన్నారు. మొత్తం 312 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ ప్రసాద్స్ ఫౌండేషన్ ఫౌండర్ , చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి, పరీక్షలు నిర్వహించిన హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి, అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ వాలంటీర్ కి రాష్ట్రస్థాయి బహుమతి




**అభినందించిన ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గువ్వలగూడెం గ్రామానికి చెందిన పొలిశెట్టి నేహ రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి తెలిపారు.గత సంవత్సరం అక్టోబర్ 10 న జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ మానసిక ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో నేహా పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కళాశాల విద్యా కమిషనర్ దేవసేన చేతుల మీదుగా జ్ఞాపిక ప్రశంసా పత్రంతో పాటు 2000 రూపాయల నగదు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేలకొండపల్లి డిగ్రీ కళాశాల నుండి రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించడం చాలా అభినందనీయం అన్నారు. నేహా కళాశాలలో జరిగే ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు తో పాటు హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఆపదమిత్ర ప్రోగ్రాంలోనూ గువ్వల గూడెం గ్రామంలో జరిగిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో ఎన్ఎస్ఎస్ కార్యకర్తగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేహను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.వెంకటేశ్వర రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ జెడ్ మార్జియనా ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు నేహాను శాలువాతో సత్కరించి అభినందించారు.

# దండు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బీరంగూడలో మజ్జిగ పంపిణీ

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, మే 17:** ఎండాకాలంలో పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు అమీన్పూర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దండు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం షెల్టర్‌లో ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త కుటుంబాక రాజశేఖర్ పాదాచారుల కోసం మధ్యాహ్నం 12 గంటల నుంచి మజ్జిగను స్పాన్సర్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజలకు చిన్న సేవ చేయాలనే భావన సమాజానికి మంచి పరిణామమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో ముందుకు వస్తున్న రాజశేఖర్ కుటుంబాన్ని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు చలివేంద్రాన్ని వినియోగించుకోవచ్చని అమీన్పూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ దండు రమేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిల్లే శ్రీనివాస్ యాదవ్, సుధాకర్ అల్లంశెట్టి, వసుంధర నాయుడు మహేందర్ రాజు, ప్రకాష్, అప్పారావు, అశోక్ శేరి, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






# మానవత్వాన్ని చాటుకున్న ఈఎల్వి ఫౌండేషన్ భాస్కర్

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ప్రైజ్ మనీ.

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని, ఈఎల్వి ఫౌండేషన్ అధినేత భాస్కర్ మరోసారి నిరూపించారు. లెంకలపల్లి గ్రామంలో ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు, ఒక అద్భుతమైన మానవీయ కోణానికి వేదికగా నిలిచాయి. లెంకలపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది గుండెపూరి నరసింహ భార్య, లక్ష్మి గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న, ఈఎల్వి ఫౌండేషన్ భాస్కర్ తక్షణమే స్పందించారు. టోర్నమెంట్‌లో దక్కాల్సిన ద్వితీయ బహుమతి ప్రైజ్ మనీ 25,116 రూపాయలను, లక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం అందజేయాలని ఆయన నిర్ణయించారు. ఆదివారం ఫౌండేషన్ ప్రతినిధులు, ఆర్గనైజర్స్ కలిసి, లక్ష్మి నివాసానికి వెళ్లి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించారు. అనంతరం టోర్నమెంట్ ద్వితీయ బహుమతి 25,116 లను, ఆమె కుటుంబ సభ్యులకు అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. క్రీడలను ప్రోత్సహించడమే కాకుండా, ఆ వేదిక ద్వారా వచ్చిన బహుమతి మొత్తాన్ని ఇలా, ఒకరి ఆరోగ్య అవసరాల కోసం ఉపయోగించడం వెనుక భాస్కర్ సేవా దృక్పథం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ అయితగోని నరసింహ, చాపల శ్రీకాంత్, పగిళ్ల అశోక్, పాక కిరణ్, మానుపాటి సతీష్, కొలుగూరి వెంకటేష్, అయితగోని భిక్షం, తిపర్తి శ్రీరాములు, రేణుకుంట్ల నరేందర్ పాల్గొని బాధితురాలికి నగదును అందజేశారు. ఆపద సమయంలో స్పందించి, తమ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఈఎల్వి ఫౌండేషన్ అధినేత, భాస్కర్ కి లెంకలపల్లి గ్రామస్తులు, యువత ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అంగరంగ వైభవంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు..

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** కాషాయ దళపతి కల్మషం లేని వ్యక్తి ప్రజల మంచి కోరే మానవత వాది ప్రతిక్షణం ప్రజల కోసం తపించే జనహృదయనేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల కోసం నిరంతరం తపించే యువ నాయకులు శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మసీదు బండ బిజెపి ఆఫీసు నందు ఆదివారం గ్రాండ్ గా బర్త్ డే సెలబ్రేషన్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ బిజెపి సీనియర్ నాయకులు నల్లూరి పట్టాభిరామ్ బిజెపి సీనియర్ నాయకులు పార్నంది నాగులు మియాపూర్ డివిజన్ బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు పత్తి బసవ శివ మియాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధవి బిజెపి సీనియర్ నాయకులు బావురి చోటా రామ్ బిజెపి యువ మోర్చా నాయకులు సిరిపాటి దుర్గాప్రసాద్ చల్లా నవీన్ పత్తి శివమణి బావురి ప్రేమారాం బావురి సురేష్ కుమార్, సంఘ సేవకులు వై. వి రమణ తది తరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మైనార్టీ గురుకుల గర్ల్స్--1 లో టీజీ ఎపసెట్ ఫలితాలలో విశిష్ట ప్రతిభ

## ప్రిన్సిపాల్ చుండు అఖిల




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలోని టీజీ ఎంఆర్జెసి ఖమ్మం గర్ల్స్--1 కళాశాల విద్యార్థినులు టీజీ ఎపసెట్ --2025 ఫలితాలలో విశిష్ట ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షకు మొత్తం 62 మంది విద్యార్థినులు హాజరుకాగా అందులో 41 మంది అర్హత సాధించి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారు.ఇంజినీరింగ్ విభాగంలో మొహమ్మద్ ఫర్జీన్ ఫిర్దోజ్ 21437 ర్యాంక్ షేక్ సన్నీ 22902 ర్యాంక్ షేక్ సైనూ 31525 ర్యాంక్ సాధించగా బైపీసీ విభాగంలో షేక్ సమీనా ఫిర్దోస్ 15720 ర్యాంక్ సంపేట కుసుమ 19214 ర్యాంక్ సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చుండు అఖిల విద్యార్థినులను అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. క్రమశిక్షణతో కూడిన బోధన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు సిబ్బంది కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.కళాశాల సాధించిన ఫలితాలను ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎండి. ముజాహిద్ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి శ్రీనివాస్ రావు ప్రాంతీయ లైజన్ కోఆర్డినేటర్ ఎం జె అరుణ కుమారి విజిలెన్స్ టీమ్ సీతారాములు రవూఫ్ జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ అఫ్రోజ్ ప్రత్యేకంగా అభినందించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్





**నా**లుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్త రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో

## ఆర్థిక కార్యాచరణ అత్యవసరం!


ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అననింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది.

# గోదావరి పరవళ్ళు - మారుతున్న కాలంలో మమతల వెల్లువ

గోదావరి పరవళ్ళు తొక్కుతూ పారుతుంది. ఆ ప్రవాహంలో ఒక లయ ఉంది, ఒక జీవం ఉంది, ఒక ప్రేమ ఉంది. పోలవరం నుండి రాజమహేంద్రవరం వరకు గోదావరి ఒడ్డున నిలిచిన ప్రతి చెట్టూ, ప్రతి రాయీ, ఆ నీటి అలలతో పాటు ఒక కథను చెప్పుకుంటాయి. ఆ కథ ప్రేమది. ఆ గాథ మానవత్వానిది. కానీ నేటి ఆధునిక జీవితంలో, ఆ గోదావరి అంతటి విశాలమైన ప్రేమ మనల్ని వదిలి దూరంగా సాగిపోతుందా అన్న ప్రశ్న మనసులను తాకుతోంది.మానవ సంబంధాలలో వస్తున్న మార్పులు, సాంకేతికత తెచ్చిన అంతరాలు, మరియు ప్రేమ-ద్వేషాల మధ్య సాగుతున్న నిరంతర సంఘర్షణను గోదావరి జీవన ప్రవంతితో పోలుస్తూ సాగే ఒక ఆత్మీయ విశ్లేషణ ఇది.

ఒకప్పుడు మన తెలుగు కుటుంబాలు ఒక్కో గోదావరి లాంటివి విశాలమైనవి, పరిపూర్ణమైనవి, అందరినీ ఒడిలో చేర్చుకునే ఆత్మీయతలు నిండినవి. అమ్మ వంట వాసన ఇంటంతా పరుచుకునేది. నాన్న పిలుపుతో ఒళ్ళు పులకరించేది. తాతయ్య కథలతో నిద్రపోయేవాళ్ళం. పండగ పూట అందరూ ఒక్కచోట కూర్చొని నవ్వులు పంచుకునేవాళ్ళం. ఆ రోజులు ఎక్కడ పోయాయి?నేడు అదే కుటుంబంలో నలుగురు నాలుగు గదుల్లో కూర్చుని నాలుగు స్క్రీన్లను చూస్తున్నారు. అదే పందిట్లో పెళ్ళి జరుగుతుందో లేదో తెలియదు కానీ, ఒకే ఇంట్లో ఉన్నా "స్త్రశీశీస ఎశీతీఅ-ఱఅస్త్ర" అని ఔఫ్త్రఞరాజూజూ లో చెప్పుకునే పరిస్థితి వచ్చింది. శరీరాలు ఒక్కచోట ఉన్నా, హృదయాలు వేల మైళ్ళ దూరంలో ఉంటున్నాయి. ఈ భావోద్వేగ దూరం జుఎశీఱశీఅఖ్రీ ఱఅర్ఖఱఅఎవ నేటి కుటుంబాలను లోపల్లోపల తినేస్తున్న ఒక మౌన మహమ్మారి. మనుషులు ఒకరినొకరు తాకడం మరిచిపోతున్నారు. కళ్ళల్లోకి చూసి మాట్లాడటం మానేస్తున్నారు. ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకునే తీరిక లేని యంత్రాలుగా మారిపోతున్నారు. ఈ స్థితి సమాజానికి ఎంతమాత్రం క్షేమకరం కాదు. సాంకేతికత మనకు సౌకర్యాలను ఇచ్చిందేమో కానీ, సహజమైన సంతోషాలను, పలకరింపులను దూరం చేసింది.

గోదావరి ఎప్పుడూ ఒక్క దిశలో పారదు. ఆమె కలిసే నది, కలుపుకొనే నది. ఆమె పారే దారిలో పచ్చదనం మొలుస్తుంది. జీవం చిగురిస్తుంది. ఒడ్డున ఉన్న పల్లెలన్నీ గోదావరి ప్రేమతో బతుకుతాయి. ఆమె ఎండిపోతే, పంటలు కూడా మాడిపోతాయి. గోదావరి ప్రవాహం మనకు సహనానికి, త్యాగానికి నిలువెత్తు రూపంగా కనిపిస్తుంది.నది ఏనాడూ తన నీటిని తాను తాగాదు, చెట్టు ఏనాడూ తన పండ్లను తాను తినదు. ప్రకృతిలోని ప్రతి అణువూ ఇతరుల కోసమే జీవిస్తుంది. మనిషి మాత్రమే స్వార్థంలో మునిగిపోతున్నాడు.అదే విధంగా కుటుంబంలో ప్రేమ అనే పాయ ఒక్కసారి ఆగిపోతే ఆ కుటుంబంలో ప్రతి మనిషీ ఒక ఎండిన చెట్టు అవుతాడు. ఆకులు ఉంటాయి, కానీ నీడ ఉండదు. కొమ్మలు ఉంటాయి, కానీ పళ్ళు కాయవు. బతికే ఉంటాడు, కానీ జీవించడు.ద్వేషం ఒక్కసారి ఇంట్లో ప్రవేశించినా, అది నిప్పులాంటిది -- ఆగదు, ఒంటరిగా ఉండదు. ఒక్క మాటతో మొదలై, ఒక్క రోజుతో పెరిగి, ఒక్క సంవత్సరంలో సంబంధాలనే తగలబెడుతుంది. కానీ ప్రేమ? ప్రేమ నీళ్ళలాంటిది. ఒక చుక్క చాలు ఎండిన విత్తనమూ మళ్ళీ పైకి తలెత్తుతుంది. విరిగిపోయిన బంధాలను సైతం అతుకు పెట్టే అమృతం ప్రేమ.సర్వేలు చెప్తున్నాయి నేటి పట్టణ కుటుంబాల్లో తల్లిదండ్రులు పిల్లలతో రోజుకు సగటున 15 నిమిషాలు కూడా మాట్లాడటం లేదు. అదే పిల్లలు తమ ఫోన్లతో రోజుకు 7 గంటలు గడుపుతున్నారు. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు ఇది హృదయాల మధ్య పెరుగుతున్న గోడల సమస్య. సంభాషణలు కరువైన చోట అనుమానాలు, అపోహలు తలదూరుస్తాయి.పెద్దవాళ్ళు అనుకుంటారు నా పిల్లలకి నేనేం చేయాల్సిన అవసరం లేదు, వాళ్ళు పెద్దయిపోయారు.పిల్లలు అనుకుంటారు అమ్మానాన్నలు అర్థం చేసుకోరు, చెప్పి ఏం లాభం? భార్యాభర్తలు అనుకుంటారు మాట్లాడితే గొడవ అవుతుంది, మాట్లాడకుండా ఉంటే నయం.ఈ మూడు ఆలోచనలూ ఒక్కో గోడ ఇటుకలు. ఒక్కో రోజూ ఆ గోడ ఎత్తు పెరుగుతోంది. చివరకు ఒకే ఇంట్లో ఉంటూనే పరాయివాళ్ళలా బతికే పరిస్థితి వస్తుంది.ఇది కేవలం నగరాల సమస్య మాత్రమే కాదు. పల్లెల్లో కూడా



ఇప్పుడు పిల్లలు వలస వెళ్ళిపోయాక, ముసలి తల్లిదండ్రులు ఒంటరిగా కూర్చొని గోడలను చూస్తూ జీవిస్తున్నారు. పండగ పూట ఫోన్ కాల్ మాత్రమే వస్తోంది కానీ ఆ పిలుపులో తడి ఉన్నా, స్పర్శ ఉండదు. డబ్బు పంపగలరు కానీ, ఆ వృద్ధాప్యంలో అవసరమైన ఆసరాను, ఓదార్పును పంపలేకపోతున్నారు.ప్రేమ అంటే కేవలం ఒక తాత్కాలిక భావన కాదు. ప్రేమ ఒక నిరంతర నిర్ణయం. ప్రతిరోజూ మనం సృష్టించుకోవాల్సిన ఒక అద్భుతమైన ఎంపిక.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని నోటితో చెప్పడం చాలా సులభం. కానీ నీకోసం నా సమయాన్ని, నా శ్రద్ధని, నా సహనాన్ని ఇస్తున్నాను అని ఆచరణలో చూపించడం అది నిజమైన ప్రేమ. గోదావరి ఒడ్డున ఉన్న రైతు ఆ నదిని ఎంత ప్రేమిస్తాడో తెలుసా? ఆమె ఉప్పొంగి వచ్చినా, ఆమె ఎండిపోయి వెళ్ళిపోయినా ఆ రైతు ఆ ఒడ్డే వదలడు. ఆ నమ్మకం, ఆ స్థిరత్వం అదే ప్రేమ.కుటుంబ బంధాల్లో కూడా అదే సత్యం వర్తిస్తుంది. గొడవలు వస్తాయి, అపోహలు పెరుగుతాయి, బాధలు కలుగుతాయి కానీ ప్రతి తెల్లవారుజాము ఒక కొత్త అవకాశం. ఆ కుటుంబం కోసం, ఆ బంధాల కోసం మళ్ళీ ఒక మంచి నిర్ణయం తీసుకోవడానికి ప్రతి రోజూ ప్రకృతి మనకు ఒక సరికొత్త అవకాశాన్ని ఇస్తుంది. ఆ అవకాశాన్ని వాడుకుని బంధాలను బలపరుచుకోవాలి.మానవ చరిత్రలో ఒక్కటి స్పష్టంగా కనిపిస్తుంది ద్వేషం నాశనం చేయగలదు, కానీ దేనినీ నిర్మించలేదు. యుద్ధాలు సంపదను నాశనం చేశాయి, నగరాలను బూడిద చేశాయి, తరాలను అనాథలుగా మార్చాయి. కానీ ఒక అమ్మ ప్రేమ, ఒక నేస్తం సాయం, ఒక తోట్టువు ఆలింగనం అవి శతాబ్దాలు గడిచినా మనుషుల మనసుల్లో పచ్చగా నిలుస్తాయి.ఒక కుటుంబంలో కూడా అంతే. ఎన్ని పోట్లాటలు వచ్చినా, ఎంతటి కోపతాపాలు ఉన్నా, ఒక్కసారి అమ్మ నుదుటిపై చేయి వేసి పర్వాలేదు నాయనా, నేనున్నానుగా అంటే ఆ మనస్తాపం, ఆ నొప్పి మొత్తం మాయమవుతుంది. ఆ ఒక్క వాక్యంలో మందు ఉంది, మాయ ఉంది, మళ్ళీ మనిషిని బతికించే అద్భుతమైన శక్తి ఉంది.

ద్వేషం ఒక్క క్షణం పాటు చాలా శక్తివంతంగా, ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ అది తన శత్రువుతో పాటు తనను తానే నాశనం చేసుకుంటుంది. అది ఒక ఆత్మఘాతుక ఆయుధం. కానీ ప్రేమ? అది ఇచ్చినకొద్దీ పెరుగుతుంది. పంచినకొద్దీ విస్తరిస్తుంది. సమాజాన్ని ఏకం చేసే ఏకైక సూత్రం ప్రేమ మాత్రమే.గోదావరి ఒడ్డున పెరిగిన ప్రతి తెలుగు మనిషికి జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకం ఉంటుంది. ఆ చల్లని నీళ్ళలో ఈతకొట్టిన జ్ఞాపకం, రేవులో పడవ ప్రయాణం చేసిన అనుభూతి. తాతయ్యతో కూర్చొని కాగితం పడవలు చేసి నీటిలో వదిలిన జ్ఞాపకం. అమ్మతో కలిసి పుష్కర స్నానం చేసి, ఆ పవిత్ర జలాలను తలపై చల్లుకున్న జ్ఞాపకం. ఆ జ్ఞాపకాలన్నీ ప్రేమతో, ఆత్మీయతతో నేయబడినవి. అవి ఎప్పటికీ చెరగవు ఎందుకంటే అవి హృదయంపై శాశ్వతంగా చెక్కబడినవి.

కానీ ఇప్పుడు పెరుగుతున్న పిల్లలకి ఆ జ్ఞాపకాలు ఏమైనా మిగులుతున్నాయా? ఫోన్ క్లోజ్డ్ స్క్రీన్ పై చూసిన వీడియోలు ఎప్పటికైనా మధుర జ్ఞాపకాలు అవుతాయా? ఖచ్చితంగా కావు.అమ్మ చేత్తో తినిపించిన గోరుముద్ద.నాన్న భుజంపై హాయిగా నిద్రపోయిన రాత్రి.అక్కతో, అన్నతో కలిసి తోటలో ఆడుకున్న సాయంత్రం.ఇవే నిజమైన జ్ఞాపకాలు. ఇవే మనిషి జీవితాన్ని సుసంపన్నం చేసే అమూల్యమైన రత్నాలు. వీటిని కోల్పోతే మనిషి కేవలం ఒక జీవచ్ఛవంలా మిగిలిపోతాడు.సమయం ఇంకా మించిపోలేదు. మార్పు అనేది ఎక్కడో దూరం నుండి రానవసరం లేదు. అది మన హృదయం నుండే మొదలవ్వాలి. ఈ రోజు నుండే ఒక్క చిన్న అడుగు వేయండి.మీ అమ్మకి ఫోన్ చేయండి ఎలాంటి అవసరం, పని లేకుండా కేవలం ఆమె క్షేమం తెలుసుకోవడానికి. మీ పిల్లాడితో ఒక అరగంట పాటు ఆడుకోండి మీ స్మార్ట్‌ఫోన్‌ను పక్కన పెట్టి, వాడి లోకంలోకి వెళ్ళి. మీ భర్తతోనో, భార్యతోనో ఒక్కసారి కళ్ళల్లోకి చూసి మాట్లాడండి నిజంగా, మనస్ఫూర్తిగా, గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ. మీ ముసలి తల్లిదండ్రులను ఒక్కసారి వెళ్ళి చూసి రండి పండగ వచ్చే వరకు ఆగకుండానే.ఈ చిన్న చిన్న చర్యలే కుటుంబంలో ఎండిపోయిన ప్రేమ పాయలను మళ్ళీ జీవకళతో పారించగలవు. ఈ చిన్న స్పర్శలే, మనుషుల మధ్య పెరిగిన ఆ పెను భావోద్వేగ గోడలను కూల్చగలవు. గోదావరి ఎప్పుడూ ఆగదు. ఆమె పారుతూనే ఉంటుంది, ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని జీవనదిగా నిలుస్తుంది. అదే విధంగా మన కుటుంబాల్లో కూడా ప్రేమ నిరంతరం పారాలి ఆగకుండా, తగ్గకుండా, ఎండిపోకుండా. ఎందుకంటే -- ప్రేమే ప్రపంచం. ప్రేమే గోదావరి.ఈ భూమిపై ఏ మతమైనా, ఏ కులమైనా, ఏ భాషైనా అన్నింటికీ ఒకే ఒక పరమార్థం, ఒకే సత్యం. మనిషికి మనిషి తోడు కావాలి, మనిషికి మనిషి ప్రేమ అవసరం. ద్వేషం పైకి చాలా శక్తివంతంగా కనిపిస్తుంది, కానీ అది చాలా పెళుసైనది, త్వరగా విరిగిపోతుంది. ప్రేమ చాలా మెత్తగా, బలహీనంగా కనిపిస్తుంది, కానీ అది శాశ్వతమైనది, హిమాలయమంత దృఢమైనది.గోదావరి నీళ్ళు ఎన్ని రాళ్ళను దాటి పారుతున్నా, ఎంత దూరం ప్రయాణించినా చివరికి ఆ మహా సముద్రంలో కలిసి ఎలాగైతే విశాలమవుతాయో, అదే విధంగా మన జీవితాల్లో ఎంత బాధలు వచ్చినా, ఎంత అపోహలు ఉన్నా, ఎంతటి దూరాలు ఏర్పడినా ప్రేమతో నడిస్తే, చివరికి కలుసుకునే మనసులే మిగులుతాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకునే కుటుంబాలే మిగులుతాయి. కాల పరీక్షకు తట్టుకుని నిలిచే బలమైన బంధాలే మిగులుతాయి.ప్రేమను ఇవ్వడం మొదలుపెట్టండి అది మీకే వేల రెట్లు తిరిగి వస్తుంది. గోదావరిలా ఎండిన తీరాలను తడుపుతూ, లోకానికి అనంతమైన జీవాన్ని పంచుతూ సాగిపోదాం.



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

## భోజ్‌శాల వద్ద భద్రత కట్టుదిట్టం

### హైకోర్టు తీర్పుతో జిల్లా యంత్రంగం చర్యలు

భోజరాజు కాలంలో ఏర్పాటు చేసిన భోజశాల కాలక్రమంలో ఇస్లాం దాడుల్లో కనుమరుగయ్యింది. దానిని ముస్లింలు స్వాధానం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. ఇది సరస్వతీమాత ఆలయంగా హిందువుల విశ్వాసం. తాజాగా మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్ హిందూ ఆలయానికి చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం నాడు సంచలన తీర్పు వెలువరించింది. మసీదు నిర్మాణం కోసం ముస్లింలు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జస్టిస్ విజయ్ కుమార్ శు క్లా, జస్టిస్ అలోక్ అవస్థితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆలయాన్ని సందర్శించే ప్రజలకు తగిన వసతులు కల్పించాలని సూచించింది. భోజ్‌శాల కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర పురావస్తు శాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ చారిత్రక కట్టడం పరిరక్షణ, భద్రత, మతపరమైన ఆచారాల నియంత్రణకు సంబంధించి పురావస్తు శాఖకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. 1958 నాటి ఎఎస్‌ఐ చట్టం ప్రకారం, ఈ ఆస్తుల బాధ్యతలను ఎఎస్‌ఐ నిర్వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. భోజ్‌శాల ఆలయ వ్యవహారాలు, పరిపాలనపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. భవిష్యత్తులో ఈ కట్టడం చారిత్రక నేపథ్యం దెబ్బతినకుండా ఎఎస్‌ఐ పర్యవేక్షణలో నిర్వహణ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. పురావస్తు శాఖ ఇటీవల సమర్పించిన రెండు వేల పేజీల సర్వే నివేదికను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. మసీదు నిర్మాణం కంటే ముందే అక్కడ పర్మార్ రాజుల కాలం నాటి ఆలయం ఉండేదని, పాత ఆలయ భాగాలతోనే మసీదు నిర్మించారని పురావస్తు శాఖ నివేదికలో పేర్కొంది. ఈ ఆధారాలనే ధర్మాసనం ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించి సవాలు చేస్తామని ముస్లిం గ్రూపు ప్రకటించింది.

## నీట్ పేపర్ లీకుకు మరొకరు బలి

### ఆందోళన కలిగిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలు

జయపుర: నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ లీక్‌వల్ల పరీక్ష రద్దవడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా రాజస్థాన్‌లోనూ ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈ పరీక్షలో 650 మార్కులు వస్తాయని తన కుమారుడు చెప్పాడంటూ అతడి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఝున్‌ఝున్ జిల్లాకు చెందిన ప్రదీప్ మహిచ్.. తన ఇద్దరు సోదరులతో కలిసి సికార్‌లో నివసిస్తున్నాడు. అక్కడే నీట్ పరీక్ష కోసం ఒక ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకున్నాడు. మే 3న జరిగిన నీట్- యూజీ పరీక్ష రాశాడు. అయితే, శుక్రవారం మధ్యాహ్నం అతడు తన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన అతడి సోదరి వెంటనే స్థానికుల సహాయంతో సమీప ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నీట్ పరీక్షను బాగా రాసినట్లు తన కుమారుడు చెప్పాడని, 650 మార్కులు వస్తాయన్నాడని ప్రదీప్ తండ్రి పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ సీటు ఖాయమని గట్టి నమ్మకంతో ఉన్నాడంటూ ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

# వసంత నగర్ డివిజన్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**సద్వినియోగం చేసుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు**

**క్యాన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**



**కూకట్‌పల్లి, మే 17 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. ప్రముఖ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, బండి రమేష్ సహకారంతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలలోని కాలనీల నుండి సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. బసవతారకం ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రోగులకు ఎంతో ఓపికగా పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. వైద్యుల సేవలను కాలనీ ప్రజలు ప్రత్యేకంగా కొనియాడారు.

**ముఖ్య అతిథుల అభినందనలు**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఇంతటి ఉత్తమ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన మాకినేని యాకనారాయణ (వినోద్)ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు అరవింద్ రెడ్డి, గంధం రాజు, చావ శ్రీనివాస్, కిలారు శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, దినేష్ కుమార్ తదితరులు పాల్గొని, శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు మాకినేని యాకనారాయణ (వినోద్) మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ మహమ్మారి పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు పరీక్షల ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నదే మా సంకల్పం. ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ, అద్భుతమైన సేవలు అందించిన బసవతారకం ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అహర్నిశలు శ్రమించి ఈ క్యాంప్‌ను విజయవంతం చేసిన వాలంటీర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీస్సులు, సహకారం ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరించాలి

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**




**కూకట్ పల్లి, మే 17 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శంబీపూర్ రాజు కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, గుర్తింపు ఉన్న ఓట్లను కూడా తొలగించడంతో ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవగాహన కల్పించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరించాలని, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాము. వ్యవసాయం, పారిశ్రామిక, ఐటి, శాంతిభద్రతలు అన్ని రంగాల్లో కూడా తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శమైందని.. కానీ నేడు ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయి వారి బ్రతుకులు అగమ్యగోచరమవుతున్నాయని, దేశంలో ఎక్కడా లేనటువంటి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, మిషన్ భగీరథ వంటి పథకాలు కెసిఆర్ ఆలోచనలోంచి పుట్టినవే అని అన్నారు. ఈ పథకాలనే దేశం ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతోందని, మళ్లీ కేసీఆర్ ను ముఖ్యమంత్రిని చేసుకుంటే ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ముందుకు వెళతామని పిలుపునిచ్చారు.

# ఏదులాపురం 13వ వార్డులో ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ హరినాథ్ బాబు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఏదులాపురం మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలో పివి భవన్ పక్కన ప్రకాష్ నగర్ రోడ్డు లో వోల్టేజ్ 100 కేవి ట్రాన్స్ఫర్ ఓపెనింగ్ చేసిన ముద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు విద్యుత్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కోక్య బర్మావత్తు ఏఈ ప్రభాకర్ 13 వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు తొమ్మిదో వార్డు కౌన్సిలర్ కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ సుశీల తనయుడు వెంకట్ 11వ వార్డు కౌన్సిలర్ పేరం వెంకట్ లక్ష్మి శ్రీనివాస్రావు లైన్ ఇన్స్పెక్టర్ ఎస్డి జాకీర్ షరీఫ్ అసిస్టెంట్ లైన్మెన్ఎండి యూసుఫ్ గ కర్లపూడి ఏసు పంతంగి వేణుగోపాల్ గోగుల శ్రీనివాసరావు ట్రాన్స్ఫార్మర్ స్థలం దాత హనుమంతరావు యాసీన్ జాఫర్ శ్రీను ఇందిరమ్మ కాలనీ పేస్టు సత్యనారాయణ బైరు రమేష్ బైరు వెంకట నారాయణ ఉపేందర్ మైనార్టీ నేత నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# కంటెస్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి రాజకీయ వర్గాల్లో సందడి.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నర్సింగ్ యాదవ్**




**కూకట్ పల్లి, మే 17 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించ్ బడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం లో పాల్గొన్న నాయకులు రవికుమార్ యాదవ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శేర్లింగంపల్లి ప్రజల అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ నాయకులు ప్రశంసలు కురి పించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్, సీనియర్ నాయకులు నరసింహ చారి, ఆంజనేయులు యాదవ్, విష్ణు, చాంద్, సురేష్, రాజు, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుం టారని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన సేవలు మరింత అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం అభిమానుల హర్షధ్వానాలు, శుభాకాంక్షల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.



# "వరి కొయ్య కు నిప్పు-తృటిలో తప్పిన భారీ నష్టం

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** వరి కొయ్యకు నిప్పు పెట్టడంతో సమీపంలోని మామిడి తోటకు మంటలు వ్యాపించి భారీ నష్టం తృటిలో తప్పింది. వివరాలలోకి వెళ్తే మండల పరిధిలోని వెంకేపల్లి లో ఓ వ్యవసాయ తన పొలంలోని వరి కొయ్యలకు నిప్పంటించగా గాలి వాటం తోడై పక్కన ఉన్న రైతుల పొలాలలోని కొయ్యలు కాలు కొంటూ సుమారు 40 ఎకరాల వరకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానిక రైతులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో తొనుకునూరి ఉప్పలయ్య కు చెందిన పలు మామిడి, చింత చెట్లు తో పాటు ఎనగందుల లింగయ్య కు చెందిన మోటార్ స్టార్టర్ పూర్తిగా దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. వరి కొయ్య కాలిన ప్రదేశాన్ని స్థానిక సర్పంచ్ ఇమ్మడి జయకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తొనుకునూరి సైదులు గౌడ్ పరిశీలించారు. రైతులు నిర్లక్ష్యంగా వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దని హెచ్చరించారు.

# స్థానిక సమస్యలపై దిల్ కుష్ నగర్ లో బండి రమేష్ పాదయాత్ర



**కూకట్ పల్లి, మే 17 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో గల దిల్ కుష్ నగర్ లో ప్రజా సమస్యలపై టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆదివారం విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. కాలనీవాసులు తమ సమస్యలను రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గతంలో తాము ఐడిపిఎల్ స్థలం రహదారి నుంచి రాకపోకలు సాగించేవారమని అయితే ఇటీవల ఈ రహదారికి అడ్డంగా ఫెన్సింగ్ చేశారని దీంతో తమకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వారు ఆందోళన వెల్లిబుచ్చారు. దీన్ని ఈ ఫినిషింగ్ తొలగించి రహదారిని పునరుద్ధరించాలని కోరారు. దీంతోపాటు ఈ కాలనీ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డ్రైనేజీ నీరు పొంగిపొర్లి రహదారులపై ప్రవహిస్తుందని దుర్వాసన వెలువడుతోందని వెంటనే కొత్తడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో నైట్ ఫ్యాట్రోలింగ్ లేకపోవడంతో అసాంఘిక శక్తులు రెచ్చి పోతున్నాయని ఈ పరిస్థితి కాలనీ ప్రజలుగా తమకు ఇబ్బందిగా పరిణమించిందని వెంటనే పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రమేష్ ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే అధికారులతో మాట్లాడుతానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, శివకుమార్, శ్రీకాంత్ పటేల్, యుగేందర్, ప్రసన్న కుమార్, నరేందర్, బాల నరసింహ, సదానందం, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

# అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు...

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కర్ణాటక గాత్ర కచేరి మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. బెంగళూరు నుండి విచ్చేసిన ఫణిరాజ్ శివశంకర్ గారు తన గాత్ర కచేరి లో గణేశా ప్రార్థన, అమ్మవారి పాటలు, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు, త్యాగరాజ కృతులను ఆలపించారు. మహబూబ్ నగర్ కి చెందిన కూచిపూడి నాట్య గురువులు శ్రీమతి అనూష శిష్య బృందం ప్రదర్శనలో శ్రీవిఘ్న రాజాం భజే, పుష్పాంజలి, గణపతి తాళం, చంద్రచూడా, అదిగో అల్లదిగో, శివ కృతి, శ్రీ హరి స్తోత్రం, శివకామ సుందరి, అయిగిరినందిని మొదలైన అంశాలను నయనాత్మిక, జోవిత, శివాత్మిక, సాయి తరుణి, హరిణి , హిమవర్షిణి, ప్రతిజ్ఞ, సాయి మోక్ష, సున్నిత, శ్రీజ, మౌనిక, సుస్మిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



# కష్టపడి చదివితేనే లక్ష్యాల సాధన

## విద్య విజయోత్సవంలో కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపు





**మంచిర్యాల మే 17 (క్రైమ్ మిర్రర్) :** విద్యార్థులు కష్టపడి చదివితే తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించగలరని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యా వారోత్సవాలు--విద్య విజయోత్సవ దినోత్సవం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, అదనపు గదులు వంటి మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.విద్యార్థులు పై తరగతుల్లో మరింత నిబద్ధత, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ విజయమే అంతిమం అనుకోకుండా భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు క్రమంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 91.4 శాతం ఫలితాలు సాధించగా, 2024-25లో 96.54 శాతం, 2025-26లో 97.20 శాతం ఫలితాలు నమోదయ్యాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల్లో 1.27 లక్షల మంది విద్యార్థులు ఉండగా, 2025-26లో ఆ సంఖ్య 1.32 లక్షలకు పెరిగిందని తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు.అనంతరం జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పదో తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాల విద్యార్థులకు రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను కలెక్టర్ అందజేశారు. 'అమ్మకు అక్షరమాల' (ఉల్లాస్) కార్యక్రమంలో సేవలందించిన వాలంటీర్లు, రాష్ట్రస్థాయి కళా వైభవం--హస్తకళల పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సన్మానించారు.పదో తరగతిలో లసెట్టి శ్వేత (582 మార్కులు), జాడి ఆంజనేయ ప్రసాద్, కట్ల సాకేత్ ప్రతిభ కనబరిచారు. ఇంటర్మీడియట్‌లో మెండు అమూల్య, కొమ్మల స్వతంత్ర (992 మార్కులు), నక్క ఊర్వశి (991) ఉత్తమ ఫలితాలు సాధించారు. క్రీడా విభాగంలో గుడిమల్ల శ్రీ వర్షిని, గాలి పెల్లి అను, కారు విష్ణు జాతీయస్థాయిలో రాణించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు బండ శాంకరి, సుంకరి లక్ష్మి, బొలిశెట్టి బుచ్చన్న, ఏ.వెంకటరాజమ్మలను కలెక్టర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్తలు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పెట్రో ధరలతో పేదల నడ్డి విరుస్తున్న బీజేపీ

**ఇంధన ధరల పెంపుతో సామాన్యులపై మోయలేని భారం**

**పెట్రోల్ ,డీజిల్ ధరలను తగ్గించాలని పాలకీడులో వినూత్న నిరసన**

**ఇంధన ధరల పెంపును ఉపసంహరించుకోవాలి**

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమల్ల సతీష్**

**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ (పాలకీడు):** డీజిల్, పెట్రోల్ ధరలు కేంద్ర ప్రభుత్వం పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమల్ల సతీష్ అన్నారు.కేంద్ర ప్రభుత్వం సామాన్యుల మెడకు గుదిబండ అయింది అని కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను నిరసిస్తూ ఆదివారం పాలకీడు మండల కేంద్రంలో ప్రయాణికులు కూర్చున్న ఆటోను తాడుతో లాగి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పన్నుల రూపంలో ఈ దేశ ప్రజల డబ్బును వసూలు చేస్తూ పేద ప్రజలను నిత్యవసర వస్తువుల మీద ధరలను వేస్తూ నిండా ముంచుతుందనీ , జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరల గురించి మౌనం పాటించడం చాలా సిగ్గుచేటు అని అన్నారు. నరేంద్ర మోడీ జిడిపిని పెంచుతా అని చెప్పి గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలను పెంచుతున్న దుర్మార్గపు ప్రభుత్వం అని మండిపడ్డారు. ఇప్పటికైనా పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను వెనక్కి తీసుకొని బిజెపి పార్టీ స్థాయిని నిలబెట్టుకోవాలని కోరారు .లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని అని హెచ్చరించారు . ఇట్టి కార్యక్రమంలో రావుల కొండలు గౌడ్, హరినాయక్ వెంకన్న, కరుణాకర్, కోటేష్ ,నాగేష్, కాశయ్య ,వీరబాబు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గిరి కుటుంబానికి బియ్యం అందజేసిన గోలి లింగస్వామి



మునుగోడు క్రైమ్ మిర్రర్: మునుగోడు పట్టణానికి చెందిన పందుల గిరి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. బిజెపి మండల కమిటీ పరామర్శించి మండల అధ్యక్షులు పెంబల జానయ్య ఆధ్వర్యంలో బిజెపి జిల్లా నాయకులు గోలి లింగస్వామి సహకారంతో 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ,జిల్లా ,మండల నాయకులు పాల్గొన్నారు.

# సదానందం గౌడ్ కు డాక్టరేట్ పురస్కారం








**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి పాలమూరు జిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక విద్యావేత్త అయిల సదానందం గౌడు కు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ చే గౌరవ డాక్టరేట్ పురస్కారం వరించింది. చెన్నైలోని భారతీయ విద్యా భవన్ లో ఆయన డాక్టరేట్ ను అందుకున్నారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని ప్రసిద్ధ ఉస్మానియా యూనివర్సిటీలో  హీూ,వీూష్ట్రఅశ్రీ,దీ.జు౧,నాజు ఫస్టు క్లాసులో పట్టా పొందారు. విద్యా రంగంలో గత 26 ఏండ్లుగా లెక్చరర్ గా ఆయన చేసిన సేవలు, పర్యావరణ పరిరక్షణకై చేసిన కృషి, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ అమృతవల్లి, మద్రాస్ హైకోర్టు జడ్జి వెంకటేశన్, గోని నర్సింహ్మా గౌడ్, రష్య రాయబారి రిజిస్ట్రార్, అధికారులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## పిఎసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోని అమ్ముకోవాలని కుల్కచర్ల పిఎసిఎస్ చైర్మన్ కనకం.మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు రైతులకు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని కుసుమసముద్రం గ్రామంలోని రైతు వేదికలో ఆదివారం పిఏసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోని అమ్ముకోవాలని దళారులకు అమ్మి మోసపోవద్దని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని అమ్ముకోవడం సన్నాలకు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని వారు సూచించారు. ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొలుసని భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుల్కచర్ల మండలం అధ్యక్షులు పి గోపాల్ నాయక్, కుసుమ సముద్రం గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, ఇప్పాయిపల్లి మాజీ సర్పంచ్ బాల్రెడ్డి, కుల్కచర్ల మాజీ ఎంపీటీసీ సెల్మిళా ఆనందం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతకాయల జంగయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డే రాములు, లాల్య నాయక్,రాంచందర్,పుర్ర బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు,




# సెంట్రింగ్ పనులు బంద్ కు ప్రతి గుత్తేదారు సహకరించాలి

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ సెంట్రింగ్ యూనియన్**

**పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం అందజేసిన సెంట్రింగ్ యూనియన్ సభ్యులు**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో సెంట్రింగ్ పనులు బంద్ విషయంలో ఎవరికి ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా నిరసన చేపట్టాలని మైలార్ దేవ్ పల్లి ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా సెంట్రింగ్ పనులు బంద్ పిలుపుమేరకు మైలార్ దేవ్ పల్లి డివిజన్ సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు రాష్ట్రవ్యాప్తంగా చేసుకునే వారిపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం గుర్తించాలని బంద్ కు పిలుపునిచ్చామని తెలిపారు. ఈ క్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని పలు కాలనీలలో సెంట్రింగ్ పనులు బంద్ పిలుపు కోసం అందరు కాంట్రాక్టర్లు సహకరించే విషయమై పోలీసులకు వినతిపత్రం ఇచ్చి సెంట్రింగ్ గుత్తేదారులు ఆవేదనను పోలీసులకు వివరించారు. ఈ సందర్భంగా మైలార్ దేవ్ పల్లి ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.... సెంట్రింగ్ పనులు బంద్ కు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేసుకోవాలని తెలిపారు చట్టపరంగా చట్టాన్ని చేతుల్లో తీసుకోకుండా మీ స్ట్రైక్ చేసుకోవాలని సెంట్రింగ్ యూనియన్ సభ్యులకు ఆయన వెల్లడించారు ఎవరికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సలహాదారులు వేముల వెంకటేష్, ఎం. దర్శన్, ఉపాధ్యక్షుడు ఎస్. శంకరయ్య, ప్రధాన కార్యదర్శి పి. అశోక్, కోశాధికారి ఎస్. బాలరాజ్, సంయుక్త కార్యదర్శులు ఎం. దేవప్ప, బి. ధనరాజ్, శేఖర్, సింహాద్రి, రామకృష్ణ, గద్దె యాదగిరి, తదితరులు పాల్గొన్నారు......

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా,
మండలవారీగా, షాద్నగర్,
కేశంపేట, కడ్తాల్, కందుకూరు,
కొత్తూరు, తలకొండపల్లి
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈక్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
Email ID: crimemirrorts@gmail.com
9393 44 6188





క్రైమ్ మిర్రర్

మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో ఖాకీ అరాచకం


క్రైమ్ మిర్రర్

మర్రిగూడలో గాడి తప్పిన లా అండ్ ఆర్డర్..!?

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 18-5-2026


# మర్రిగూడలో ఖాకీ అరాచకాలకు చెక్..

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ప్రజల నీరాజనాలు.

## క్రైమ్ మిర్రర్ పత్రికకు కృతజ్ఞతలు!.

క్రైమ్ మిర్రర్ కథనానికి స్పందన



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):-** మర్రిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొంతకాలంగా సాగుతున్న అక్రమాలు, అవినీతి, సామాన్య ప్రజలపై సాగించిన ఖాకీ అరాచకాలపై, ఉన్నతాధికారులు ఎట్టకేలకు కొరడా ఝులిపించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి, రక్షణ కవచంలా నిలవాల్సిన పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చగా మారిన సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మునుగాల కృష్ణారెడ్డిపై, నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ, ఆయన్ను విఆర్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామం. ఈ సాహసోపేతమైన ప్రజానుకూల నిర్ణయం పట్ల మర్రిగూడ మండల ప్రజలు, ఆదివారం స్థానిక చౌరస్తాలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి తమకు న్యాయం చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ చిత్రపటానికి, పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు.

**పత్రికా స్వేచ్ఛకు దక్కిన విజయం 'క్రైమ్ మిర్రర్'కు అభినందనలు**

ఈ మొత్తం వ్యవహారంలో మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో జరుగుతున్న, అవినీతి అక్రమాలను, అరాచకాలను సాక్ష్యాధారాలతో సహా నిరంతరం వెలికితీసిన 'క్రైమ్ మిర్రర్' దినపత్రిక పాత్ర అత్యంత ప్రశంసనీయమని ప్రజలు అన్నారు. "మర్రిగూడలో గాడి తప్పిన లా అండ్ ఆర్డర్" "బాధితులపైనే అక్రమ కేసులు.. రక్షణ కవచమా? రాక్షసత్వమా?" అంటూ 'క్రైమ్ మిర్రర్' ప్రచురించిన వరుస సంచలన కథనాలు, మండలంలో తీవ్ర సంచలనం సృష్టించాయి. వెంకేపల్లి తండాకు చెందిన గిరిజన యువకులను అక్రమంగా కేసుల్లో ఇరికించడం, పేకాట శిబిరాల నిర్వాహకుల నుండి ముడుపులు స్వీకరించడం, హోటల్ ఫుడ్ బిల్లులు సైతం బాధితులతో కట్టించడం వంటి దారుణాలను 'క్రైమ్ మిర్రర్' సమాజం ముందుకు తెచ్చింది. పాలకుల, ఉన్నతాధికారుల కళ్లు తెరిపించేలా, బాధితుల పక్షాన నిలిచి నిఖార్సైన జర్నలిజానికి నిదర్శనంగా నిలిచిన 'క్రైమ్ మిర్రర్' పత్రికకు, ప్రతినిధులకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**బాధితులపై అక్రమ కేసులు -- ప్రజాప్రతినిధుల ఆగ్రహం**

గతంలో ఎస్ఐ కృష్ణారెడ్డి బాధితుల పక్షాన నిలిచిన, 15 మంది అమాయక గిరిజన యువకులపై అక్రమ కేసులు బనాయించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఖాకీ అరాచకాలపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో బాధితులను వేధించే అధికారులకు తావులేదని, సదరు అధికారిని తక్షణమే విధుల నుండి తొలగించాలని, జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి వివరించారు. 'క్రైమ్ మిర్రర్' రాసిన కథనాలు, ప్రజా ప్రతినిధుల ఒత్తిడి, ప్రజల నుండి వ్యక్తమైన తీవ్ర నిరసనలతో స్పందించిన ఎస్పీ పవార్, తక్షణ చర్యలు చేపట్టారు.

## ప్రజా రక్షకుడిగా నిలిచిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

మర్రిగూడ మండల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, శాంతిభద్రతలను భ్రష్టుపట్టించిన ఎస్ఐపై, చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సామాన్య ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించారు. నిరుపేదల ఆవేదనను గుర్తించి, అవినీతికి తావులేకుండా ఆర్డర్ పాస్ చేసిన, ఎస్పీ పవార్ నిర్ణయాన్ని కొనియాడుతూ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చౌరస్తాలో భారీగా బాణాసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, ఎస్పీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మిర్యాలగూడ టూ టౌన్ నుండి నూతన ఎస్ఐగా నియమితులైన, రాంబాబు ఆధ్వర్యంలోనైనా మర్రిగూడలో శాంతిభద్రతలు తిరిగి అదుపులోకి వస్తాయని, అక్రమ దందాలకు, మాఫియాలకు అడ్డుకట్ట పడుతుందని సామాన్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అమాయకులకు అండగా నిలిచిన 'క్రైమ్ మిర్రర్' పత్రికకు, న్యాయాన్ని కాపాడిన ఎస్పీకి మర్రిగూడ ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెర భీమనపల్లి మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు, కెవి గౌడ్, అచ్చిని సైదులు, నడిమింటి శీను, మాదగోని మహేష్ గౌడ్, నాగిళ్ళ మారయ్య, సిరగోని వెంకటేష్, నడిమింటి రవి, గోరిగే రమేష్, పంతంగి సాయి కుమార్, అచ్చిని బాలరాజు, అంబళ్ల వెంకటయ్య, ఇస్తారీ తదితర ముఖ్య నాయకులు, మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీరంగూడలో అంబేద్కర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు






**న్యాయం ప్రతి పేదవాడి చెంతకు చేరాలి -- సిహెచ్. శ్రీనివాస్**

**సామాన్యులకు న్యాయం చేరువ చేయడమే లక్ష్యం -- నిర్వాహకులు**

**16 ఏళ్ల అనుభవంతో ముగ్గురు అడ్వకేట్ల సేవా సంకల్పం**

**ఉచిత న్యాయ సలహాలు అందించనున్న అంబేద్కర్ ట్రస్ట్**

**భూ వివాదాలు, మహిళా హక్కులపై ప్రత్యేక సహాయం**

**గ్రామాల్లో లీగల్ అవగాహన క్యాంపులు నిర్వహిస్తాం**

**యువత ఉపాధి కోసం సినిమాటిక్ స్టూడియో ప్రారంభం**

**ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకూడదు -- ఎడ్ల రమేష్**

**బీరంగూడ అభివృద్ధికి యువతే బలం**

**క్రమశిక్షణతో ఎదిగిన అడ్వకేట్ శ్రీనివాస్‌కు ప్రశంసలు**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, మే 17:** సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం అందించాలనే సంకల్పంతో బీరంగూడలో ఎస్ ఆర్ అడ్వకేట్ అండ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఘనంగా ఏర్పాటు చేశారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ ఆర్ అడ్వకేట్ అండ్ అసోషియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ... న్యాయం -- సమానత్వం -- సేవ అనే ఆశయాలతో ఈ ట్రస్ట్ పని చేయనున్నట్లు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. "అంబేద్కర్ చెప్పినట్టు ప్రతి పేద, బలహీన వర్గాలకు న్యాయం చేరినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. న్యాయం ధనికులకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి సాధారణ వ్యక్తికి అందాలి. అదే మా ట్రస్ట్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం" అని ఆయన తెలిపారు.గత 16 సంవత్సరాలుగా న్యాయ వృత్తిలో అనుభవం కలిగిన సిహెచ్. శ్రీనివాస్, టి. చంద్రశేఖర్ రెడ్డి, దాసోజు శ్రీనివాస్ కలిసి ఈ ట్రస్ట్‌ను స్థాపించినట్లు వెల్లడించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, కార్మిక సమస్యలు, సామాజిక వివాదాలపై అర్హులైన వారికి ఉచిత న్యాయ సలహాలు, అవసరమైన న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు.న్యాయ అవగాహన లేక చాలా మంది తమ హక్కులను కోల్పోతున్నారని, అలాంటి వారిని చట్టపరంగా చైతన్యవంతులను చేయడం కూడా ట్రస్ట్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమాలు, లీగల్ కౌన్సెలింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే యువత ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ఇదే భవనంలో ఆధునిక సౌకర్యాలతో సినిమాటిక్ స్టూడియోను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలన్నదే తమ ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ మాట్లాడారు... భ్రమరాంబిక కాలనీలో ఎస్ ఆర్ అడ్వొకేట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. బీరంగూడ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతూ జనాభా పెరుగుతున్న ప్రాంతంగా మారిందని తెలిపారు. ఇక్కడే పుట్టి పెరిగిన శ్రీనివాస్ ఒక క్రమశిక్షణ గల వ్యక్తిగా చిన్నప్పటి నుంచే ఎదిగాడని, అదే క్రమశిక్షణతో నేడు విజయవంతమైన అడ్వకేట్‌గా నిలిచాడని ప్రశంసించారు. ఈ ప్రాంతంలో పేదలు కూడా అధిక సంఖ్యలో ఉన్నారని, అంబేద్కర్ వెల్ఫేర్ ట్రస్ట్ వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే సినిమాటిక్ ఫోటోగ్రఫీ స్టూడియో ద్వారా యువత సొంత కాళ్లపై నిలబడే అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొంటూ యువతకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆమీన్పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, బైస సుధాకర్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, పలువురు న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు హాజరై ట్రస్ట్ కార్యకలాపాలను అభినందించారు.భవిష్యత్తులో సమాజ సేవ, న్యాయ సహాయం, యువత అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.

# ప్రియుడితో ప్రేమ పెళ్లి.. ఇద్దరితో వివాహేతర సంబంధం..

మధిర: భర్తకు దూరంగా ఉంటున్న ఓ మహిళకు ఇద్దరితో పరిచయం ఏర్పడింది. ఇద్దరితో ప్రేమాయణం నడిపింది. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య మొదలైన ఘర్షణ.. సదరు మహిళ హత్యకు దారి తీసింది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలోని మధిర మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మృతురాలిని కల్పనగా గుర్తించారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరుకు చెందిన గోపిశెట్టి కల్పన (27), మైలవరం మండలం బొర్రగూడెంకు చెందిన దేరంగుల నాగరాజు 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు జన్మించాక మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. ఆపై కల్పన కొంతకాలం తిరువూరులో, ప్రస్తుతం మధిరలోని ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. ఈ క్రమంలో వాయిద్యకారుడు విజయభాస్కర్‌తో ఆమెకు పరిచయం ఏర్పడ్డాక, కొన్నాళ్లకు తిరువూరులోని ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పనిచేసే గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన యార్లగడ్డ చెన్నారావుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై విజయభాస్కర్, చెన్నారావు మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ప్రస్తుతం మేడూరులోని పుట్టింట్లో ఉంటూ మధిర వచ్చి వెళ్లే కల్పన రోజులాగే శనివారం కూడా బయలుదేరింది.

**ఇద్దరం కలిసి మాట్లాడుదాం..**

కల్పన విషయమై మాట్లాడే పని ఉందని, ఆమె కూడా వస్తున్నందున రావాలని చెన్నారావు.. విజయభాస్కర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో, తొలుత చెన్నారావు, కల్పన ద్విచక్ర వాహనంపై మధిర మండలం కృష్ణాపురం సమీపాన వెంచర్‌లోకి వెళ్లారు. ఆ లొకేషన్‌ను విజయభాస్కర్‌కు షేర్ చేయడంతో ఆయన కాసేపయ్యాక బయలుదేరాడు. అయితే, తొలుత వెళ్లిన చెన్నారావు, కల్పన మధ్య జరిగిన వాగ్వాదంతో ఆమెను హత్య చేసినట్లు తెలుస్తోంది. ఆపై చెన్నారావు వెళ్లిపోగా, కాసేపటికి లొకేషన్ ఆధారంగా చేరుకున్న విజయభాస్కర్‌కు ఇద్దరూ కనిపించకపోవడంతో వెనుదిరిగాడు. కొద్దిసేపయ్యాక కల్పన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మధిర సీఐ మధు, సిబ్బంది చేరుకుని పంచనామా నిర్వహించారు. అంతేకాక మృతురాలి భర్త నాగరాజు, ఆమెతో పరిచయం ఉన్న విజయభాస్కర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, హత్య అనంతరం పరారైన చెన్నారావు.. కల్పన సోదరుడి సెల్‌ఫోన్‌కు పలు అంశాలపై వాట్సప్ మెసేజ్‌లు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ వెల్లడించారు. కాగా, కల్పన వివాహేతర సంబంధం కారణంగా ఆమె కుమారుడు ఒంటరైపోయాడని స్థానికులు చెబుతున్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

## నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలి

## మంత్రి సీతక్క సూచన

హైదరాబాద్: ఉద్యోగులు హక్కులతో పాటు విధులు కూడా గుర్తుంచుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కాపాడుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి తోడ్పాటు అందిస్తోందని వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి కోసం స్త్రీనిధి ఏర్పాటయిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిన స్త్రీనిధి అని చెప్పారు. 32 లక్షల మహిళలకు రుణాలు అందించిందని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలకు నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను అనుసరిస్తున్నాయని.. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్న స్త్రీ నిధి బ్యాంక్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు వస్తే వెంటనే వెరిఫై చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడు ఆరోపణలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని మంత్రి వివరించారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు. చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్త్రీనిధి మహిళల కోసం మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. స్త్రీనిధిని కాపాడుకోవాలి. ఉద్యోగ అనుకూల ప్రభుత్వం మా ప్రభుత్వం. స్త్రీ నిధి ఏర్పాటులో, దాన్ని విజయవంతం చేయడంలో కృషిచేసిన విద్యాసాగర్ రెడ్డికి అభినందనలు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానని మంత్రి సీతక్క వెల్లడించారు.

# నాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

## రాహుల్‌ను కోరిన పరిగి ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని.. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేదని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా జిల్లాలో 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగానే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబం మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే పని చేస్తోందని.. బూత్ స్థాయి నుంచి తాను పని చేసినట్లు గుర్తు చేశారు. నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని.. పార్టీ అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు.

# విద్య విజయోత్సవంలో ప్రతిభావంతుల విద్యార్థులకు నగదు పురస్కారాలు




ప్రతిభావంతుల విద్యార్థులకు రూ.10 వేల నగదు పురస్కారం

టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభపై ప్రశంసలు

విద్య, క్రీడా రంగాల్లో రాణించిన 11 మందికి అవార్డులు

ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు సన్మానం

సంగారెడ్డి కలెక్టరేట్‌లో విద్య విజయోత్సవ వేడుకలు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచన

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 17:** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా "విద్య విజయోత్సవం" వేడుకలను ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యా, క్రీడా రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు చెక్కు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు.

**నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు:**

- కుమ్మరి మౌనిక -- జడ్పిహెచ్ఎస్ మల్కాపూర్, కొండాపూర్ -- పదో తరగతిలో ద్వితీయ ర్యాంక్ (592/600)
- సంపల్లి ధనలక్ష్మి -- జడ్పిహెచ్ఎస్ మల్కాపూర్, కొండాపూర్ -- పదో తరగతిలో తృతీయ ర్యాంక్ (588/600)
- పెద్దపట్నం ధరణి -- జడ్పిహెచ్ఎస్ యెద్దుమైలారం, కంది -- పదో తరగతిలో తృతీయ ర్యాంక్ (588/600)
- ఎ. గాయత్రి -- గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ -- ఇంటర్మీడియట్ ప్రథమ ర్యాంక్ (992/1000)
- ఎం. అరవింద -- గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ -- ఇంటర్మీడియట్ ప్రథమ ర్యాంక్ (992/1000)
- బి. నిఖిత -- గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ -- ఇంటర్మీడియట్ ద్వితీయ ర్యాంక్ (991/1000)
- కె. రుత్విక రెడ్డి -- జడ్పిహెచ్ఎస్ బీరంగూడ, అమీన్‌పూర్ -- జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి
- ఎం. స్మితక -- జడ్పిహెచ్ఎస్ కానుకుంట, ఆర్‌సీ పురం -- వుషు క్రీడలో ముఖ్యమంత్రి కప్-2025 విజేత
- వి. ప్రియాంక -- కస్తూర్బా బాలికల విద్యాలయం, పుల్కల్ -- జాతీయ స్థాయి ఆత్యా పాత్యా క్రీడాకారిణి
- కమ్మరి పూజ -- కస్తూర్బా బాలికల విద్యాలయం, కొండాపూర్ -- ఇంటర్మీడియట్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఫస్ట్ ర్యాంక్ (965/1000)
- లక్ష్మి పద్మావతి -- తెలంగాణ మోడల్ పాఠశాల, వెలిమల -- ఇంటర్మీడియట్ ఎంఈసీ విభాగంలో ప్రథమ స్థానం (912/1000)
- అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారిని ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దిన ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందిని అతిథుల చేతుల మీదుగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, అదనపు సంచాలకులు శంకర్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యా సమన్వయ మండలి కార్యదర్శి లింబాజీ, బాలయ్య, తాజుద్దీన్, భీమగౌండ, వెంకటస్వామి, సిద్ధారెడ్డి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిసి స్టడీ సర్కిల్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లైఫ్ స్కిల్స్ పై 4 రోజుల వర్క్‌షాప్

ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

-ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి శ్రీలత

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం బిసి స్టడీ సర్కిల్ లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)అండ్ లైఫ్ స్కిల్స్ పై జూన్ 8 నుండి జూన్ 11 వరకు నాలుగు రోజుల వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుంది.విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాథమిక అంశాలు వివిధ అప్లికేషన్లపై అవగాహన కల్పించడం మరియు జీవనోపాధి కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే విధంగా తీర్చిదిద్దడం ఈ వర్క్ షాప్ ప్రధాన లక్ష్యం.ఈ కార్యక్రమానికి ఆసక్తి కలిగిన ఖమ్మం కొత్తగూడెం జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 18 నుండి జూన్ 6 లోపు ఖమ్మం నగరం ఎన్టీఆర్ సర్కిల్ బైపాస్ రోడ్డు నందు గల బీసీ స్టడీ సర్కిల్ నందు నేరుగా ధరఖాస్తు అందజేయగలరని ఖమ్మం బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు.ఇతర వివరాలకు ఫోన్ 08742-230848 మరియు 9441931359 ను సంప్రదించగలరని తెలిపారు.

## బచ్చోడులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పదవ తరగతి బచ్చోడులో మొదటి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండల పరిధిలోని బచ్చోడు గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను పరస్పరం పంచుకున్నారు. చాలాకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆత్మీయంగా మాట్లాడుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. గురువుల సేవలను స్మరించుకుంటూ, వారి మార్గదర్శకత్వం తమ జీవితాలలో ఎంతగానో దోహదపడిందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.కార్యక్రమం మొత్తం స్నేహపూర్వక వాతావరణంలో సాగి పాల్గొన్న వారందరికీ చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది.10 సంవత్సరాల గురువులను ఒక చోటికి చేర్చి వారిని సన్మానించడం ఆనందాన్నిచ్చిందని విద్యార్థులు సంతోషాన్ని పంచుకున్నారు 1992 నుండి 2002 వరకు మొదటి బ్యాచ్ 10వ తరగతి మానుండే మొదలు కావడం చాలా సంతోషకరంగా ఉన్నదని పూర్వ విద్యార్థులు సంతోషించారు. ఈ కార్యక్రమంలో గురువులు జ్యోతిబాస్ రమణ రావు చంద్రశేఖర్ సుగుణబాయి స్వర్ణలత లత జ్యోతి ఉపేందర్ సార్ సాయిరాం దేవి వాణిశ్రీ గురువులు పాల్గొన్నారు పూర్వ విద్యార్థులు గొర్రెపాటి రమేష్ శ్రీను గొర్రెపాటి నగేష్ బాబు పుల్లయ్య రంగారావు ఉపేందర్ వల్లపు రవి ఉమా జ్యోతి రమణ హరిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు ముగింపు




క్రైమ్ మిర్రర్, నల్లగొండ: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా చివరి రోజు సాంస్కృతిక,క్రీడా కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లగొండ డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ అమీర్ , మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హరీష్ కుమార్, విశ్వవిద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ మేయర్.. మన సంస్కృతిని, క్రీడలను ఎల్లప్పుడూ కాపాడుకోవాలన్నారు. అవి మనకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె శ్రీనివాస రాజు మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడా పోటీలు స్ఫూర్తిని నింపుతాయని ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు మన దేశ సంస్కృతిని కాపాడుతాయని చెప్పారు. కళాశాల క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేయడం జరిగింది. చివరగా కళాశాల విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మంజుల, సాంస్కృతిక కన్వీనర్ డాక్టర్ భూక్య వీరన్న, అమరావతి, , ప్రొఫెసర్ అరవింద, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ సునీత, డాక్టర్ జబీన్, డాక్టర్ సుంకరి రాజారామ్, మల్లికార్జున్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్--స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..

### 300 మందిపై కేసులు...





**సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఏ డీసీపీ ట్రాఫిక్ ×, జి హన్మంతరావుతెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 300 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.253 ద్విచక్ర వాహనదారులు,09 ఆటోలు,38 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే ---232 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 35 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,33 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (11.05.2026--16.05.2026) లో మొత్తం 96 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 07 మందికి జరిమానా, జైలు శిక్ష,02 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,87 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్‌కు మంటలు ఎల్లమ్మాగూడ ఘటన



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, మే 17:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ఎల్లమ్మాగూడ గ్రామంలో గడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని గ్రామస్తులు తెలిపారు. తృటిలో ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యుత్ తీగలు కిందకు వాలిపోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు.

# ఉప్పల్ చౌరస్తా మూసివేత.. ప్రత్యామ్నాయ మార్గాలు ఇలా..



ఉప్పల్: అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ చౌరస్తాను ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఉప్పల్ విద్యుత్ జంక్షన్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నిర్మాణ పనుల్లో భాగంగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం నుంచి ఉప్పల్ రింగ్ రోడ్ మీదుగా వరంగల్ వైపు వెళ్లే అన్ని రకాల వాహనాలను దారి మళ్లిస్తున్నా మని సూచించారు. జీహెచ్ఎంసీ కార్యాలయం పక్కనున్న వరంగల్ బస్టాప్‌ను ఇప్పటికే ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్దకు మార్చిన విషయం విదితమే.

**ప్రత్యామ్నాయ మార్గాలు ఇలా..**

హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే భారీ వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం, మల్లాపూర్, ఐవోసీ, చెంగిచర్ల మీదుగా వరంగల్ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది. చిన్న వాహనాలు ఉప్పల్ ఇందిరాగాంధీ పార్కునుంచి లిటిల్ ఫ్లవర్ వెనక దారి నుంచి వరంగల్ రహదారికి చేరుకోవచ్చు. వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు ఉప్పల్ ఏషియన్ సినీ థియేటర్ ఎదుటి హెచ్ఎండీఏ రోడ్డు ద్వారా నాగోల్ రోడ్డుకు కలుపుతారు. ద్విచక్ర వాహనదారులు నాగోల్ మెట్రో పిల్లర్లు 812, 813 నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే, భారీ వాహనాలు నాగోల్ బ్రిడ్జి కింద నుంచి యూ టర్న్ చేసుకుని తిరిగి ఉప్పల్ వైపు రావాలి. వరంగల్ వైపు వెళ్లేవారు హెచ్ఎండీఏ లే అవుట్ నుంచి వరంగల్ హైవేకు చేరుకోవాలి. హైదరాబాద్‌కు వచ్చే వరంగల్ బస్సులు, లారీలు, భారీ వాహనాలన్నీ ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్ మీదుగా నగరానికి చేరుకోవాల్సి ఉంటుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.